క్లుప్తంగా

క్రీడలతో మానసిక ఉల్లాసం



ఇండోర్ స్టేడియంను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబు

ఆళ్లగడ్డ: క్రీడలు మానసిక ఉల్లాసం ఇవ్వడంతో పాటు క్రమశిక్షణకు దోహదం చేస్తాయని మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబు అన్నారు. పట్టణంలోని కేవీకే ఇండోర్ స్టేడియంలో మౌళిక వసతులు, సమస్యల గురించి మంగళవారం కమిషనర్ క్రీడాకారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు తెలిపిన సమస్యలు పరిష్కరించేందుకు తక్షణం చర్యలు తీసుకుంటామన్నారు. ఈ నెల 21వ తేదీ నుంచి షటిల్, బ్యాడ్మింటన్‌పై 6 నుంచి 17 సంవత్సరాల వయస్సు ఉన్న స్కూల్ విద్యార్థులకు శిక్షణ ఇస్తామన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో కోచ్ సుబ్బరాయుడు ఉన్నారు

ఆరోగ్య కేంద్రం తనిఖీ



ఆరోగ్య సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న జిల్లా ప్రత్యేక వైద్యాధికారి

ఉయ్యాలవాడ: మండలంలోని మాయలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం జిల్లా ప్రత్యేక వైద్యాధికారిణి నజిమిన్ తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆమె పీహెచ్‌సీ పరిధిలోని వైద్యసిబ్బందితో మాట్లాడుతూ గ్రామాల్లో సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం పీహెచ్‌సీలో జరిగే వైద్యపరీక్షల రికార్డులను పరిశీలించారు. క్షయ గర్భిణులకు హిమోగ్లోబిన్ శాతం ఎంతఉందనే దాని ఆరా తీశారు. ఎవరికైనా రక్తహీనత ఉంటే జిల్లా వైద్యశాలకు రెఫర్ చేయాలని సూచించారు.

ప్రయాణికులకు మెరుగైన సేవలందించాలి



ఆర్టీసీ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అఖిలప్రియ

ఆళ్లగడ్డ: ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించాలని ఎమ్మెల్యే అఖిలప్రియ అధికారులకు సూచించారు. స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో మంగళవారం ఆమె ఏపీఎస్‌ఆర్టీసీ ఈడీ వెంకటేశ్వర్‌రావు, ఆర్‌ఎం రజియాసుల్తాన, డీఎం రాజశేఖర్‌రెడ్డిలతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఆమె మాట్లాడుతూ ప్రయాణికుల రద్దీని బట్టి సర్వీసులు పెంచాలన్నారు. విజయవాడ, తిరుపతి, హైదరాబాద్‌లకు సర్వీసులు పెంచాలని కోరారు. ఆర్టీసీ డిపో, బస్టాండ్‌లో నీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు.

నిధుల కోసం పోరాటాం

నంద్యాల(న్యూటౌన్): భవన నిర్మాణ కార్మికులకు సంబంధించిన సంక్షేమ బోర్డు నిధులను సాధించుకునేంత వరకు పోరాటాలు కొనసాగిస్తామని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బాషా, బాలవెంకట్ అన్నారు. మంగళవారం స్థానిక ఆ యూనియన్ కార్యాలయంలో జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...భవన నిర్మాణ కార్మికులకు గతంలో సహజ, ప్రమాద మరణానికి, అంత్యక్రియలకు, ఆడపిల్లల కాన్పులకు డబ్బులు ఇచ్చే వారన్నారు. అందుకు సంబంధించిన పథకాలకు వెంటనే బడ్జెట్ కేటాయించాలన్నారు. అనంతరం నంద్యాల జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఏపీ బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా అధ్యక్షుడిగా ఎస్‌కే బాషా, ప్రధాన కార్యదర్శిగా వి.బాలవెంకట్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రాముడు, కోశాధికారిగా వీరన్న, ఉపాధ్యక్షుడిగా తిమ్మయ్య, సహాయ కార్యదర్శిగా రసూల్, మౌలాలి, కమిటీ సభ్యులతో పాటు 26 మందిని జిల్లా కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

జేసీ ఆదేశాలు బేఖాతరు



రైతు బజార్ పక్కన ప్రభుత్వ స్థలంలో ఉన్న టెంట్

నంద్యాల(సిటీ): జేసీ రాహుల్ కుమార్‌రెడ్డి ఆదేశాలను మున్సిపల్ అధికారులు బేఖాతరు చేస్తున్నారు. ఈ నెల11వ తేదీన పట్టణంలోని రైతు బజార్ వద్ద ఉన్న మున్సిపల్ స్థలాన్ని ఆయన పరిశీలించారు. ఆ స్థలానికి ఏర్పాటు చేసిన రక్షణ గోడ తొలగి ఉండటంతో అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్కడ ఏర్పాటు చేసిన తాత్కాలిక టెంట్లను వెంటనే తొలగించి స్థలం ఆక్రమణకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. అయితే, ఇప్పటి వరకు జేసీ ఆదేశాలను మునిసిపల్ అధికారులు ఆచరణలో పెట్టలేదు. కనీసం తాత్కాలిక టెంట్లను సైతం తొలగించలేదు. మునిసిపల్ అధికారులు ఇంత నిర్లక్ష్యంగా ఉంటే ప్రభుత్వ స్థలాలు కాపాడేది ఎప్పుడని స్థానికులు చర్చించుకుంటున్నారు.

మూగజీవాలు భద్రం!

- వర్షాకాలంలో పొంచి ఉన్న వ్యాధులు
- జిల్లాలో 16,02,698 మూగ జీవాలు
- వాటి ఆరోగ్యం విషయంలో అప్రమత్తంగా ఉండాలి
- క్రమం తప్పకుండా టీకాలు వేయిస్తేనే రక్ష



గొర్రెలకు టీకాలు వేస్తున్న పశువైద్య సిబ్బంది

గోస్పాడు: చాలా మందికి మూగజీవాలే జీవనాధారం. కంటికి రెప్పలా కాపాడుకునే వాటికి వర్షాకాలంలో వివిధ ప్రాణాంతక వ్యాధులు సోకే ప్రమాదముంది. దీంతో రైతులు, పశుపోషకులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుంది. ఈ పరిస్థితి తలెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటే ప్రాణాంతక వ్యాధుల నుంచి పశువులను కాపాడుకోవచ్చు. పశువుల్లో ముఖ్యంగా గొంతువాపు, జబ్బువావు, పాదుగు వాపు, జీవాల్లో చిటుక వ్యాధి, నీలినాలిక వ్యాధి వంటివి వర్షాకాలంలో ప్రబలే అవకాశాలు ఎక్కువగా ఉన్నట్లు వైద్య నిపుణులు చెబుతున్నారు. జిల్లాలో తెల్లజాతి పశువులు 1 2,0,565, నల్లజాతి పశువులు 293830, గొర్రెలు 8824,29, మేకలు 30,5854 ఉన్నాయి. సీజనల్ ముప్పు పొంచి ఉన్న నేపథ్యంలో వాటి ఆరోగ్యం విషయంలో అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. ఈ నేపథ్యంలో ప్రస్తుతం ప్రబలే వ్యాధులు, వాటి లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వేయించాల్సిన టీకాల గురించి పశు వైద్యులు వివరించారు.

గొంతు వాపు వ్యాధి

వర్షాకాలంలో గేదెలకు సోకే ప్రాణాంతక వ్యాధుల్లో గొంతువాపు ఒకటి. ఈ జబ్బు తీవ్రత ఎక్కువగా ఉంటే వ్యాధి సోకిన గంటల వ్యవధిలో పశువు చనిపోతుంది. అధిక జ్వరం, నోటినుంచి సొంగ కారడం, ముక్కునుంచి చిక్కటి ద్రవం స్రవించడం, గొంతు భాగంలో వాపు తరువాత వాపు క్రమంగా దవడలు, పొట్ట భాగానికి విస్తరిస్తుంది. దీని నివారణ కొరకు వ్యాధి సోకిన పశువులను ఇతర జీవాల నుంచి దూరం పెట్టాలి. ముందుస్తుగా 4 నెలలు దాటిన పశువులకు వ్యాధినిరోధక టీకాలు వేయించాలి.

జబ్బువాపు...

ఈ వ్యాధి 6 నుంచి రెండేళ్ల వయస్సు గల ఆవుల్లో ఎక్కువగా వస్తుంది. ఈ వ్యాధి క్లాస్ట్రిడియం చావై అనే బ్యాక్టీరియా వలన కలుగుతుంది. జబ్బు సోకిన పశువులకు తీవ్రమైన జ్వరం, వెనుక కాళ్లలో భుజము, తొడలలో వాపు వచ్చి పశువులు నడవలేక కుంటుతాయి. నివారణ కొరకు ముందుగా వ్యాధిగ్రస్త పశువులను వేరుచేయాలి. నాలుగు నెలలు దాటిన పశువులకు ముందుగానే జబ్బువాపు వ్యాధి టీకాలు వేయించాలి..

చిటుక జబ్బు..

ఈ చిటుక రోగం గొర్రెలకు వస్తుంది. తొలకరి వానల తరువాత పెరిగే గడ్డిని తినడంతో ఈ వ్యాధి సోకుతుంది. వ్యాధి తీవ్రంగా ఉంటే మందలో బలిష్టంగా ఉన్న గొర్రెలు, మేకలు ఎటువంటి లక్షణాలు చూపించకుండా ఆకస్మాత్తుగా మరణిస్తాయి. జీవాలు చనిపోయే ముందు నీరసంగా ఉండడం, కాళ్లు బిగుసుకుపోవడం, కాళ్లతో పొట్టను తన్నుకోవడం, పళ్లు కొరుకుతూ గాలిలో చెంగున ఎగిరి కిందపడి చనిపోతాయి. ఈ వ్యాధి ఎక్కువ మొత్తంలో పాలు తాగిన గొర్రె పిల్లల్లో కనిపిస్తుంది. మందలోని అన్ని జీవాలకు చిటిక వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి. అలాగే తొలకరిలో జీవాలు కడుపునిండా మేత మేయకుండా చూడాలి.

నీలి నాలుక వ్యాధి

దీనినే మూతి వాపు లేదా బ్లూటంగ్ అనే పేర్లతో పిలుస్తారు. ఈ వ్యాధి దోమలు ఉధృతంగా ఉండే జూలై, ఆగస్టు నెలల్లో గొర్రెల్లో ఎక్కువగా కనిపిస్తుంది. వ్యాధి సోకిన జీవాల్లో తీవ్రమైన జ్వరం, మూతి, పెదవులు, నాలుక, ముఖము ఎర్రబడుతుంది. ముక్కులు వాచి స్రవాలు కారుతాయి. కాళ్ల గిట్టల దగ్గర ఎర్రగా మారి కుంటుతాయి. జీవాల్లో 10 శాతం మరణాలు సంభవించే అవకాశం ఉంది. దోమలను నివారించడానికి వేప పొగ పెట్టాలి.



మేతకు వెళ్తున్న గేదెలు

జిల్లాకు మంజూరైన టీకాలు, ఇప్పటి వరకు వేసిన టీకాల వివరాలు ఇలా..

వ్యాధి	మంజూరైన టీకాలు	వేసిన టీకాలు
చిటుకు వ్యాధి	10,49,500	51,68,85
జబ్బువాపు వ్యాధి	47,200	46,362
గొంతు వాపు	32,36,00	1,38,512
నీలి నాలుక వ్యాధి	8,71,200	1,20623

తీసుకోవాల్సిన జాగ్రత్తల్లో కొన్ని..

- వర్షాకాలం ఆరంభమయ్యే ముందే పశువులకు, జీవాలకు టీకాలు వేయించాలి.
- పశువుల పాకల్లో నీరు నిలువ ఉండకుండా పొడిగా ఉండేలా చూడాలి. పొడిసున్నం, బ్లీచింగ్ పౌడర్ చల్లాలి.
- ఈదురుగాలులు తగలకుండా పశువుల పాకల చుట్టూ పరదాలు కట్టాలి.
- పరిశుభ్రమైన తాగునీరు, మేత ఎల్లప్పుడూ అందుబాటులో ఉంచాలి.
- చనిపోయిన పశువుల కళేబరాలను ఊరికి దూరంగా ఆరడుగుల గోతిలో సున్నం వేసి పూడ్చాలి.
- ఈగలు, దోమలు పశువులను కుట్టకుండా దోమతెరలుకట్టడం, పశువుల పాకలో వేప పొగ వేయడం చేయాలి.
- ఎక్కువ పశువులు ఒకేచోట గుంపులుగా ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

పశువులను గమనిస్తూ ఉండాలి



వర్షా కాలంలో వ్యాధులు ప్రబలే అవకాశం ఎక్కువగా ఉన్నందున పశుపోషకులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి. పశువులను జాగ్రత్తగా గమనిస్తూ ఏదైనా తేడా కనిపిస్తే సమీపంలోని పశువైద్యులను సంప్రదించాలి. జిల్లాలోని పశువులు, జీవాల సంఖ్యకు అనుగుణంగా అవసరమైన వ్యాధి నిరోధక టీకాలు అందుబాటులో ఉన్నాయి. అన్ని ప్రభుత్వ పశువైద్యశాలల్లో టీకాలు వేస్తున్నారు. – గోవిందనాయక్, జిల్లా పశుసంవర్థక శాఖ అధికారి

వైభవంగా అష్టాదళ పాదపద్మారాధన సేవ



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని గాంధీచౌక్‌లో వెలసిన కాళికాంబ చంద్రశేఖర దేవస్థానంలో అమ్మవారికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాళికాంబమాత మూల విరాట్‌కు ఉదయాన్నే సుప్రభాత సేవ, పంచామృత అభిషేకాలు, నిమ్మ, వేప రసాలతో ప్రత్యేక అభిషేకాలు చేశారు. అనంతరం అమ్మవారిని పట్టు వస్త్రాలతో అలంకరించి వివిధ రకాల పూలతో పూలంగి సేవ, 108 వెండి పుష్పాలతో అష్టాదళ పాదపద్మారాధన సేవ నిర్వహించి మహామంగళ హారతులు ఇచ్చారు. నవవిధ హారతులు ఇచ్చి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ లక్ష్మీనారాయణ, ఆరవేటి వాసు, విజయ్ కుమార్ తిమ్మయ్య, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

పెద్దమ్మకు చీర, సారెల సమర్పణ



గ్రామోత్సవంలో మహిళల కోలాటం

నంద్యాల(వ్యవసాయం): ఆషాఢమాసాన్ని పురస్కరించుకుని పట్టణంలోని రోజాకుంట వీధికి చెందిన మహిళలు మంగళవారం భక్తి శ్రద్ధలతో పెద్దమ్మకు చీర, సారెలు సమర్పించారు. ఈ సందర్భంగా అమ్మ వారి ప్రతిమను ప్రత్యేకంగా అలంకరించి కోలాటాలతో నృత్యం చేసుకుంటూ పురవీధుల గుండా బైర్మల్ వీధిలోని పెద్దమ్మ ఆలయానికి చేరుకున్నారు. అక్కడ అమ్మవారిని దర్శించుకుని చీర, సారె సమర్పించారు.

వీఓఏలను తొలగిస్తే ఉద్యమిస్తాం



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న వీఓఏలు

నంద్యాల(న్యూటౌన్): పొదుపు సంఘాల మహిళలకు దీర్ఘకాలికంగా సేవలు అందిస్తున్న వీఓఏలను తొలగించి కొత్త వారిని తీసుకోవాలని చూస్తే ఉద్యమిస్తామని ఏపీ వెలుగు వీఓఏ యానిమేటర్స్ ఉద్యోగుల సంఘం నాయకులు హెచ్చరించారు. వీఓఏలపై రాజకీయ వేధింపులు ఆపాలని, మూడు సంవత్సరాల కాలపరిమితి సర్క్యులర్‌ను రద్దు చేయాలని, హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలని, గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని కోరుతూఆ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా జరిగింది. సంఘం నాయకుడు సోమన్న అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నాగరాజు, యేసురత్నం రాష్ట్ర కోశాధికారి తిరుపతయ్య మాట్లాడుతూ...రాష్ట్రంలో 28 వేల మంది వీఓఏలు ఉన్నారన్నారు. వీరంతా తక్కువ వేతనంతో పనిచేస్తున్నారని చెప్పారు. వారందరికీ ప్రస్తుత ప్రభుత్వం ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు శంకరయ్య, పుల్లయ్య, ఆంజనేయులు, వెంకటరమణ, చంటి, వెంకటేష్, జ్యోతి, సురేష్, మధు, నాగవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

స్కీం వర్కర్లపై రాజకీయ దాడులు సరికాదు



సమావేశంలో మాట్లాడుతున్న ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి మునెప్ప

నంద్యాల(సెంట్రల్): రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వం రాగానే స్కీం కార్మికులపై రాజకీయ దాడులు పెరిగాయని, వెంటనే వాటిని ఆపకపోతే ఆందోళన కార్యక్రమాలు తీవ్రతరం చేస్తామని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి మునెప్ప హెచ్చరించారు. మంగళవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ... స్కూలు ఆయాలు, మధ్యాహ్న భోజన పథకం కార్మికులు, ఆశ, అంగన్‌వాడీ కార్మికుల్ని వేధిస్తున్నారన్నారు. వారిని ఆదుకోవాల్సింది పోయి దాడులకు తెగబడటం సరికాదన్నారు. త్వరలో విశాఖపట్నంలో ఏఐటీయూసీ జాతీయ సమ్మేళనం నిర్వహిస్తున్నామని, అందులో విశాఖ ఉక్కును కాపాడుకోవడంపై చర్చిస్తామన్నారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు, సుంకయ్య, రమేష్‌బాబు, బాలకృష్ణ, రఘురాంమూర్తి, నాగిరెడ్డి, అబ్బాస్ తదితరులు పాల్గొన్నారు.

'తల్లికి వందనం' ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకే ఇవ్వాలి

నంద్యాల(న్యూటౌన్): తల్లికి వందనం పథకాన్ని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకే వర్తింపజేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర అకాడమిక్ కమిటీ సభ్యులు సాంబశివుడు, నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి నగరి శ్రీనివాసులు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం స్థానిక ఏపీటీఎఫ్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ...రాష్ట్రంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియంతో పాటు తెలుగునూ కొనసాగించాలన్నారు. జీపీఎస్ అమలుపై విడుదల చేసిన రాజపత్రాన్ని నిలుపుదల చేయాలన్నారు. జీఓ నంబరు 117ను వెంటనే రద్దు చేయాలన్నారు. టీచర్ పోస్టులకు ప్రిపేర్ అయ్యే నిరుద్యోగులకు వయో పరిమితి పెంచాలన్నారు. డీఎస్సీ ద్వారా ఏకకాలంలో 28 వేల ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలన్నారు. అలాగే మున్సిపల్ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులకు పదోన్నతులు, బదిలీలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు పుల్లయ్య, పవన్‌కుమార్, మునిస్వామి, ప్రతాప్ రెడ్డి, రవి, విజయకుమార్, రమేష్, వెంకట్రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి మార్గాలను అన్వేషించండి

- నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలి
- స్కిల్ డెవలప్‌మెంట్, ఉపాధి కల్పన అధికారులతో జిల్లా కలెక్టర్



స్కిల్ డెవలెప్‌మెంట్ అధికారులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ రాజకుమారి

నంద్యాల: నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు మార్గాలను అన్వేషించాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి స్కిల్ డెవలప్‌మెంట్, ఉపాధి కల్పన అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆమె తన చాంబరులో జిల్లా ఉపాధి కల్పనాధికారి దీప్తి, స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి ప్రతాపరెడ్డి, జూనియర్ ఎంప్లాయిమెంట్ అధికారి సోమశివారెడ్డి తదితరులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యువత చెడు అలవాట్లకు బానిస కాకుండా వారికి ఆసక్తిగల రంగాల్లో నైపుణ్య శిక్షణ ఇవ్వాలన్నారు. తర్వాత ఆ రంగాల్లో ఉపాధి అవకాశాలు కల్పించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. స్థానికంగా ఏర్పాటు చేసుకోవడానికి వీలున్న యూనిట్లపై ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో ఉన్న నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపరిచేందుకు ఏమి చేయగలమో అన్వేషించాలన్నారు. అగరబత్తుల తయారీ, టైలరింగ్, ఫ్యాషన్ డిజైనింగ్, ఫుడ్ ప్రాసెసింగ్, పికిల్ ఇండస్ట్రీస్, మిల్లెట్ బిస్కెట్ల తయారీ తదితర ఉపాధి రంగాల యూనిట్ల స్థాపనకు అవసరమైన వనరులను గుర్తించి ప్రతిపాదనలతో రావాలన్నారు. జిల్లా ఉపాధి కల్పనా కార్యాలయంలో నిరుద్యోగ యువత రిజిస్ట్రేషన్ల ప్రక్రియను ముమ్మరం చేసే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. డోన్‌లో ఉన్న మోడల్ కెరీర్ సెంటర్‌ను నంద్యాల జిల్లా కేంద్రానికి తీసుకొచ్చేందుకు సరైన కారణాలతో ప్రతిపాదనలు సిద్ధం చేసి ఇవ్వాలన్నారు. జిల్లాలో ఉన్న ఐటీఐ, పాలిటెక్నిక్ కళాశాలలను పటిష్టం చేసి విద్యార్థులను ప్రోత్సహించాలన్నారు. ఉపాధి కల్పన, నైపుణ్య అభివృద్ధి సంస్థలు సంయుక్తంగా జాబ్ మేళాలు నిర్వహించి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు.

పర్యాటకులను ఆకర్షించాలి

నంద్యాల: జిల్లాలోని పుణ్యక్షేత్రాలు, పర్యాటకరంగం ఆధీనంలోని రెస్టారెంట్లు, వసతి గృహాలు పర్యాటకులను ఆకర్షించేలా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి టూరిజం అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆమె తన చాంబర్‌లో జిల్లా పర్యాటక మండలి అభివృద్ధి కమిటీతో సమావేశమయ్యారు. కమిటీ సభ్యులు, జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్ రెడ్డి, ఎండోమెంట్ అసిస్టెంట్ కమిషనర్ మోహన్, టూరిజం అధికారి సత్యనారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వచ్చే శ్రావణ, కార్తీక మాసాల్లో జిల్లాలోని పుణ్యక్షేత్రాల్లో పర్యాటకుల తాకిడి అధికంగా ఉంటుందన్నారు. ఒకే రోజు జిల్లాలోని ప్రముఖ ఆలయాలు సందర్శించేలా రూట్ మ్యాప్ ఏర్పాటు చేసి, ప్యాకేజీ కింద భక్తులను తీసుకెళ్లేందుకు ప్రణాళికలు రూపొందించాలన్నారు. బెలుం గుహలకు సమీపంలో ఉన్న పురావస్తు శాఖ వారి యానిసన్ రాతి వనాలను సందర్శించే రీతిలో అభివృద్ధి చేయాలన్నారు. శ్రీశైలంలోని పాతాళ గంగలో ప్రైవేట్ బోటు ప్రయాణానికి పర్యాటక శాఖకు చెల్లించే రుసుమును 12 శాతం నుంచి 10 శాతానికి తగ్గించేందుకు కమిటీ సభ్యులతో కలెక్టర్ అంగీకరించారు. యాగంటి, అవుకు, ముచ్చుమర్రి, సంగమేశ్వరం ప్రాంతాల్లో పర్యాటక శాఖ వసతి గృహాలు, డార్మెటరీలు, రెస్టారెంట్లను పబ్లిక్, ప్రైవేట్ భాగస్వామ్యంతో అభివృద్ధి చేసి లీజుకు ఇచ్చేలా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని టూరిజం అధికారి సత్యనారాయణను ఆదేశించారు. నంద్యాలలో హరిత హోటల్ నిర్మాణానికి అవసరమయ్యే రెండు ఎకరాల స్థలాన్ని గుర్తించాలని జేసీకి సూచించారు. నంద్యాలలో నగరవనం ఏర్పాటుకు అవసరమయ్యే అటవీ భూములను గుర్తించి సంబంధిత ప్రతిపాదనలను సమర్పించాలని అటవీ శాఖ అధికారులకు సూచించారు. జిల్లాలోని ప్రాచీన సంస్కృతులు, నృత్య ప్రదర్శనలు ఇతర సాంస్కృతిక రంగాల సంబంధించిన సంప్రదాయ కళలను గుర్తించి ప్రమోట్ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పాఠశాల విద్యార్థులకు టూరిజంపై వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి, విద్యాశాఖ అధికారి సుధాకర్ రెడ్డి, ఎస్సీ ఇరిగేషన్ ఆఫీసర్ వెంకటరమణ, డి ఎస్‌డీఓ రాజు, డీఎఫ్ఓ శివ శంకర్ రెడ్డి, డీపీఎం చంద్రమౌళి, టూరిజం అడ్మిన్ నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

'అన్నా క్యాంటీన్ల'ను సిద్ధం చేయండి



అన్నా క్యాంటీన్ వద్ద పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ నిరంజన్‌రెడ్డి

నంద్యాల(సిటీ): నంద్యాల పట్టణంలో అన్నా క్యాంటీన్ల ఏర్పాటుకు అవసరమైన పనులు ముమ్మరం చేయాలని మున్సిపల్ కమిషనర్ నిరంజన్‌రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక బస్టాండ్ వద్ద ఉన్న అన్నా క్యాంటీన్‌ను ఆయన మున్సిపల్ ఇంజినీర్లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజల ఆకలి తీర్చేందుకు ప్రభుత్వం అన్నా క్యాంటీన్లను ఏర్పాటు చేస్తుందన్నారు. ఇందుకు పట్టణంలో అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. అలాగే హెడ్ వాటర్ వర్క్స్ వద్ద నీటి శుద్ధి పనులను పరిశీలించారు. అంటు వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో ప్రజలకు నాణ్యమైన నీటిని అందించేందుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఆయన వెంట మున్సిపల్ ఇంజనీర్ రమణ మూర్తి, డీఈఈ మధుకుమార్ తదితరులు ఉన్నారు.

భక్తి శ్రద్ధలతో పెద్ద సరిగెత్తు



ఉయ్యాలవాడలో పీర్లకు ఫాతెహాలు సమర్పిస్తున్న భక్తులు

నంద్యాల(వ్యవసాయం): మొహర్రం మతసామరస్యానికి ప్రతీక. హిందూ, ముస్లింలు కలిసిమెలిసి భక్తిశ్రద్ధలతో ఈ పండుగ చేస్తారు. మంగళవారం పెద్ద సరిగెత్తు సందర్భంగా నీలి వీధిలో వెలసిన బీ ఫాతిమా, గాంధీచౌక్ హుసేనాశం, జుమ్మామసీద్ వద్ద ఇమాం హుస్సేన్ పీర్లను ముజావర్లు ప్రత్యేకంగా తయారు చేసి పూల దండలు, తమలపాకు దండలు, బాసికాలు, దట్టీలను సమర్పించారు. రాత్రి అగ్ని గుండం ప్రవేశం కార్యక్రమం నిర్వహించారు. మహిళలు పెద్ద ఎత్తున హాజరై తమ మొక్కులు తీర్చుకున్నారు. పట్టణంలో రాత్రి గ్రామోత్సవం నిర్వహించారు.

➤ **రుద్రవరం:** మండల కేంద్రం రుద్రవరం తోపాటు తువ్వపల్లె, ఆలమూరు, నర్సాపురం, ఆర్.నాగులవరం, మందలూరు, కొండమాయపల్లె, శ్రీరంగాపురం, పెద్దకంబలూరు, చిన్న కంబలూరు, చిత్రేనిపల్లె తదితర గ్రామాల్లో ప్రజలు చావిళ్ల వద్దకు వెళ్లి పీర్లకు ప్రత్యేక ఫాతెహాలు, మొక్కులు సమర్పించుకున్నారు.

➤ **దొర్నిపాడు:** మొహర్రంను పురస్కరించుకుని మండలంలోని గ్రామాల్లో మంగళవారం పెద్ద సరిగెత్తును భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం కులమతాలకు అతీతంగా కొలువైన బారాహిమాం, దస్తగిరి, మౌలా లి, ఖాశీం స్వాములకు ఫాతెహాలు సమర్పించారు.

ఉయ్యాలవాడ: పెద్ద సరిగెత్తును మంగళవారం మండల ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. స్థానిక చావిల్లలో కొలువైన పీర్లకు చక్కెర, పులగం, పానకం చదివించి ఫాతెహాలు సమర్పించారు.

పీర్లకు ప్రత్యేక ఫాతెహాలు

గోస్పాడు: మొహర్రం పండుగ సందర్భంగా మండలపరిధిలోని గ్రామాల్లో పీర్లు కొలువుదీరాయి. జూలేపల్లె, గోస్పాడు, పసురపాడు, ఒంటివెలగల, కానాలపల్లె తదితర గ్రామాల్లో పీర్ల చావిల్లను ప్రత్యేకంగా అలంకరించారు. అగ్నిగుండాలనుఏర్పాటుచేశారు. చిన్న, మధ్య సరుగెత్తుల అనంతరం మంగళవారం పెద్ద సరుగెత్తు నిర్వహించారు. ఆయా గ్రామాల ప్రజలు పీర్ల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామికి నైవేద్యం సమర్పించుకున్నారు. గ్రామాల్లో కొలువుదీరిన పీర్లను నేడు ఆయా గ్రామాల్లోని కుంటలు, వాగుల వద్ద నిమజ్జనం చేయనున్నట్లు తెలిపారు.

శ్రీలాల్‌స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే

చాగలమర్రి: స్థానిక చిన్నమాకానంలో కొలువుదీరిన శ్రీలాల్‌స్వామిని మంగళవారం ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ దర్శించుకున్నారు. ఆమె వెంట మాజీ సర్పంచ్ ఎంఎస్ అన్సర్‌బాషా, మాజీ జెడ్పీటీసీ రామసుబ్బయ్య తదితరులు ఉన్నారు.

త్యాగానికి ప్రతీక మొహర్రం



లాల్‌స్వామి పీరును దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి

చాగలమర్రి: మహమ్మద్ ప్రవక్త మనువడు హజ్రత్ ఇమాం హుస్సేన్ త్యాగానికి ప్రతీక మొహర్రం అని ఆళ్లగడ్డ మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి అన్నారు. మంగళవారం ఆయన చాగలమర్రి చిన్నమకానంలో వెలసిన శ్రీలాల్‌స్వామి పీరును దర్శించుకున్నారు. అందరికీ మేలు జరగాలని, వర్షాలు బాగా కురిసి పాడి పంటలలతో నియోజకవర్గ ప్రజలు సుభిక్షంగా ఉండాలని స్వామిని వేడుకున్నట్లు ఆయన తెలిపారు. ప్రతి ఏడాది చాగలమర్రిలో మొహర్రం పండుగకు హాజరై స్వామిని దర్శించుకోవడం తనకు ఎంతో సంతృప్తినిస్తుందన్నారు. అంతకు ముందు మాజీ ఎమ్మెల్యేకు శ్రీలాల్‌స్వామి కమిటీ అధ్యక్షుడు ముల్లా జిలాన్ బాషా, ఉపాధ్యక్షుడు చక్రం షబ్బీర్, ప్రధాన కార్యదర్శి ముల్లా ఖాదర్‌బాషా, సంయుక్త కార్యదర్శి ముల్లా ఇబ్రహీం, కోశాధికారి, మండల ఉపాధ్యక్షుడు ముల్లా రఫీ, ఏపీ మైనారిటీ సెల్ ప్రధాన కార్యదర్శి షేక్ బాబులాల్ తదితరులు స్వాగతం పలికి సత్కరించారు.